రామకృష్ణ

# స్పందన

తెలుపు చప్పుడయ్యేటప్పటికి తలెత్తి చూశాను. అంతే! అలా చూస్తూ వుండిపోయాను. ఆశ్చర్యం, ఆనందం' నా కనుబొమలు ముడివడ్డాయ్. ఎవరీ అపరిచిత వ్యక్తి? నాతో ఈమెకు ఏం పని? ఇంతకుముందెప్పుడైనా చూశానా? ఏమో చూసినట్లే అనిపిస్తోంది? ఎక్కడ? ఎప్పుడు? అన్నీ ప్రశ్నలే? నాకు తెలియకుండానే చిరునవ్వు నవ్వాను.

"నమస్కారం! లోపలికి రావచ్చా?" నేనింకా ఆశ్చర్యంలోనే వున్నాను. ఎంత ఆనువుగా మాట్లాడుతోంది. నేను బాగా తెలుసా? ఆ! రండి. అంటూ కుర్చీలోంచి లేచి ఫోల్డింగ్ చెయిర్ వేసి 'కూర్చోండి', అన్నాను మర్యాదగా. నవ్వుతూ వచ్చి కూర్చుంది. నేను ఇంకా నిలబడే వున్నాను. 'అరె! నిలబడి వున్నారే! కూర్చోండి' అంది తను. మంత్రముగ్ధుడిలా కూర్చున్నాను. ఇంకా ఆ అమ్మాయినే చూస్తున్నాను. ఆమెకు కోపీ తెలియదు. నా కుర్చీపక్కన వుంచిన కాగితాలవైపు నిశితంగా చూస్తూ "ఏమిటి రాస్తున్నారు? కథా?" నేను కూడా వాటివైపు చూసి, చిన్నగా నవ్వి 'ఏదో సరదాగా అప్పుడప్పుడూ వ్రాస్తూ వుంటాను' అన్నాను. 'పాడుతూ కూడా వుంటారట కదా?' అనడిగింది. ఎవరు చెప్పారీమెకు? ఏమిటిలా చకచకా అడిగేస్తోంది? ఒక అమ్మాయి తనెవరో తెలియదు., అయినా ఎప్పటినుండో పరిచయం వున్నదానిలా మాట్లాడుతోంది. తనేమో సమాధానాలు ఇస్తున్నాడు. తనకుమాత్రం ఆ అమ్మాయిని ఎక్కడో చూసినట్లుగా అనిపిస్తోంది. కానీ ఎక్కడ? అది తెలియకే ఇంతసేపూ సందిగ్ధం.

ఆలోచనలోంచి తేరుకొని 'నేను మిమ్మల్ని ఎక్కడో కలిశాను. కానీ ఎక్కడో గుర్తురావడం లేదు అన్నాను.

'నన్నా! ఇంతకుముందు కలిశారా? ఎక్కడ! లేదు' అని ఖచ్చితంగా చెప్పింది. కానీ నాకు నమ్మబుద్ధికావటం లేదు. లేదు! ఎక్కడో చూశాను. ఆ కళ్ళు, ఆ నవ్వు, మాట్లాడే తీరు. నాకు చిరపరిచితంగా అనిపిస్తోంది. కాసేపు తనే అదీ.... ఇదీ.... మాట్లాడింది. వస్తానండీ! అంటూ, వెళ్ళిపోయింది. నేనింకా ఆలోచనలోనే వున్నాను. నేను ఆలోచనలోంచి తేరుకొని నవ్వుతూ లేచేప్పటికే తను వెళ్ళిపోయింది.

* * *

తెల్లవారుఝాము మూడు గంటలకు ఎందుకో మెలకువ వచ్చింది. అక్కణ్ణించి మళ్ళీ ఆలోచన ఆ అమ్మాయి వైపుకు మళ్ళింది. ఆ అమ్మాయిని ఎక్కడ చూశాను? అలా ఎంతసేపు ఆలోచించానో తెలియదు. చటుక్కున జ్ఞాపకం వచ్చింది. నాకు ఇంక నవ్వు ఆగలేదు పెద్దగా నవ్వేశాను. నాకు 'జూహీచావ్లా' (హిందీ సినిమా నటి) బాగా తెలుసా? కలిశాను కూడానా? ఆ! అమ్మాయితో భలే వాదించానే, ఇంతకు ముందు మిమ్మల్ని చూశానని. నాకు ఎందుకలా అనిపించింది? పోనీ నేను ఆ సినీయాక్టర్ని చూసింది కూడా ఒకే ఒక్కసారి. అదీ ఎప్పుడో చాలా నెలల క్రితం. అయినా ఎందుకిలా అనిపించింది. మళ్ళీ నవ్వొచ్చింది. రేపు ఆ అమ్మాయితో ఈ విషయం చెప్పాలి. ఏమనుకుంటుంది? అమ్మో! ప్రతీ అబ్బాయీ అమ్మాయిని వళ్లో వేసుకో,



డానికి చేసే పొగర్త అనుకుంటుందా? 'షటప్' అన్నా ఆశ్చర్యపోనక్కరలేదు. నాకు ఆ విషయం బయటపెట్టడానికి ధైర్యం చాల్లేదు.

* * *

తెల్లవారిపోయింది. ఆలోచనలన్నీ ఆ అమ్మాయిచుట్టూ తిరుగుతున్నాయ్. గబగబ మొహం కడుక్కొని, షేవ్ చేసుకొని, స్నానం కూడా కానిచ్చేసి డ్రెస్ తగిలించేసుకొని బయట ఏ హోటల్లోనో టిఫిన్ కొట్టేసి ఆఫీసు కెళ్ళాలని [illegible] అంతా రెడీ అయ్యి తలుపు తెరిచేప్పటికి ఎదురుగ్గా ఆ అమ్మాయి. నా ఆనందం వర్ణనాతీతం అయ్యింది. 'గుడ్ మాణింగ్' ఏమిటి అప్పుడే ఆఫీసుకి వెళ్ళిపోతున్నారా? అడిగింది. నా ఆనందం బాపతు ఆలోచనలోంచి ఇంకా నేను బయటికి రాలేదు. రావాలని కూడా లేదు నాకు. 'మిమ్మల్నే! అప్పుడే ఆఫీసుకి వెళ్ళిపోతున్నారా?' మళ్ళీ అదే ప్రశ్న. అవునండి. ఏ హోటల్‌లోనో టిఫిన్ తిని, 'అట్నుండి అటే ఆఫీసుకి వెళ్తాను' అన్నాను. 'సరే అయితే' అంటూ చకచకా మెట్లుదిగి వెళ్ళిపోయింది. నేను రూం లాక్‌చేసి కిందికి వచ్చాను. గేటు దాటబోతూంటే వినిపించింది. 'త్వరగా వస్తారా?' అని. అది నేను ఊహించనిది, చటుక్కున వెనక్కి తిరిగాను కానీ సమాధానం చెప్పడానికి, కాస్త తడబడ్డాను. కానీ ఆ విషయం బయట పడకుండా- ఆ! వచ్చేస్తాను.... వచ్చేస్తాను.... అంటూ రెండు అడుగులు వెనక్కివేసి ముందుకు కదిలాను.

* * *

మళ్ళీ ఆఫీసులో అవే ఆలోచనలు. "ఎందుకు ఆ అమ్మాయి నాతో మాట్లాడటానికి అంత ఆసక్తి చూపుతోంది? తను ఎవరితోనైనా అలాగే మాట్లాడుతుందా? నా అంతరాత్మ అందుకు అంగీకరించలేదు. "లేదు అందరితో అలా మాట్లాడదు. అలా మాట్లాడకుండా వుంటే బావుణ్ణు. [illegible] దురాశ. మనస్సు పనిమీద లగ్నం [illegible]టంలేదు. నా అంతరాత్మ హెచ్చరిస్తోంది "ఏం! ఏమిటా ఆలోచనలు. ఏదో మాట్లాడినంతమాత్రాన నువ్వు ఏమిటేమిటో వూహించేసుకొని ఊహాలోకంలో విహరిస్తున్నావ్. తర్వాత బాధపడతావ్. బాధపడతావ్. అంటోంది.

నిజంగా బాధపడాల్సొస్తుందా? అదే నిజమైతే నేను తట్టుకోగల్నా? లేనిపోని ఆశలు పెట్టుకుంటున్నానా? వద్దు తరువాత వచ్చే పరిణామాలకు తట్టుకోలేను. ఇప్పుడే మనస్సును కంట్రోల్ చేసుకోవటం మంచిది. అనుకున్నాను. అలా అనుకొని ఓ క్షణం కూడా కాలేదు. "త్వరగా వచ్చేస్తారా?" అన్న ఆ అమ్మాయి మాటలు రింగురింగున చెవిలో తిరుగుతున్నాయి. ఇలా నాకూ నా అంతరాత్మకు ఘర్షణ జరుగుతోంది. ఆఫీసుటైం అయిపోయింది. మామూలుగా అయితే ఏకంగా రాత్రి భోజనం కానిచ్చి ఏ తొమ్మిదిగంటలకో రూముకి వెళ్ళేవాణ్ణి. కానీ ఈ రోజు అలా కాదే. "త్వరగా వచ్చేస్తారా?" అన్న ఆ అమ్మాయి మాటలు మనస్సును తొలిచేస్తుంటే ఎలా ఆగగలను. గబగబ రూముకి వచ్చేశాను. నా కోసం ఎదురు చూస్తూ వుంటుంది అనుకున్న నాకు ఘోరంగా నిరాశ ఎదురైంది. తను కనిపించలేదు. ధైర్యంచేసి మా యింటి ఓనరుగారి ఇంటి తలుపు తట్టాను. ఆమె బయటికి వచ్చారు. ఎలా మాట్లాడటం మొదలుపెట్టాలి. 'నాకు ఏమైనా లెటర్స్ వచ్చాయాండి!' ఏదో ఒకటి అడగాలిగా! అడిగేశాను. ఆమె నవ్వుతూ "లేదు బాబూ!" ఏం ఏమైనా రావాల్సినవి వున్నాయా? అనడిగారు. మాటలు పెంచడానికి అవకాశం దొరికింది. "అవునండి. అసలు ఎప్పుడో రావల్సింది. ఇంకా రాలేదూ అంటే- ఈ పోస్టల్‌వాళ్ళమీద అస్సలు నమ్మకం లేకుండా పోతోంది." ఇదంతా ఏదో మాటలు పెంచాలనే తప్ప.... వచ్చే లెటరూ లేదు.... పోయే లెటరూ లేదు. అలా మరికాసేపు పనికిమాలిన కబుర్లు చెప్పి.... ఇక లాభం లేదని ధైర్యం చేసి- "మీ ఇంటికి ఎవరో బంధువులు వచ్చినట్టున్నారు కదండీ" అన్నాను. ఇక వూసగుచ్చినట్టు విషయాలన్నీ చెప్తుందికదా అని ఎదురుచూసిన నాకు నిరాశ మిగిలింది. "బంధువులా.... ఎక్కడ.... ఎవరూ రాలేదే. అనేశారామె. ఇంకెలా విషయం రాబట్టటం. ఇక లాభంలేదు. డైరెక్ట్ ఎటాక్ చెయ్యక తప్పదని నిశ్చయించుకొని- "బంధువులు అంటే చాలామంది అని కాదండీ. ఎవరో బంధువుల 'అమ్మాయి' వచ్చినట్టుంది కదా!" అన్నాను. అప్పుడామె చిన్నగా నవ్వి, ఆదా! ఆ అమ్మాయి నాకు మనుమరాలు. మెడ్రాసులో వుంటారు వాళ్ళు. ఫ్రెండ్స్‌తో



ఎక్స్‌కర్షన్‌కని వచ్చిందట. చూసి వెళ్దామని నా దగ్గరకొచ్చింది. ఈరోజు వెళిపోతుంది. అన్నా రామె. అంతే మెదడు మొద్దుబారింది.... గుండెను ఎవరో పిండినట్లుగా అయ్యింది. చాలా ఎత్తునుంచి అగాధంలో పడిపోయినట్లుగా అనిపించింది. ఇంక అక్కడ వుండలేకపోయాను. ఏడవలేక నవ్వినట్టుగా నవ్వి .. నా రూముకెళ్ళి అలాగే కుర్చీలో కూర్చుండిపోయాను. మనసంతా చిరాకుగా అయిపోయింది. [illegible] నన్ను నేను మర్చిపోయాను. నా అంతరాత్మ నా మీద జాలిపడింది. "నేను ముందే చెప్పానుకద; అలా ఆశలు పెంచుకొని ఊహల్లో విహరించొద్దని.... అయిందేదో అయింది. జరిగింది మర్చిపో" అని ఓదార్చబోయింది. నాకు వుక్రోషం వచ్చింది.... అభిమానం దెబ్బతింది.... రెండు చేతుల్తో జుట్టుపట్టుకొని వున్నదిలా "నో" అని గట్టిగా అరిచాను. బయటికి కాదు మనస్సులో. అలా ఎంతసేపు వున్నానో తెలీదు. "ఏమిటి

అలా కూర్చున్నారు? ఎంతసేపైంది వచ్చి?" అన్న ప్రశ్నకు కళ్ళు తెరిచి చూశాను. ఎదురుగా నవ్వుతూ ఆ అమ్మాయి. సంతోషం రాబోయింది కానీ వెంటనే గుర్తొచ్చింది. ఆమె వెళ్ళిపోతున్న సంగతి. పేలవంగా నవ్వాను. ఆ అమ్మాయితో మాట్లాడాలనీ వుంది. కానీ మాట్లాడితే బాధ మిగుల్తుందని తెలుసు. చెప్పలేనంత కోపం వచ్చింది ఆ అమ్మాయిమీద. ఎందుకు నాతో మాట్లాడాలి. నన్ను వూహాలోకంలో విహరించేట్టు ఎందుకు చెయ్యాలి. ఒక్క రోజు వుండి వెళ్ళేదానికి నాతో మాట్లాడక పోతేనేం. నా వుక్రోషం ఇలా ఆలోచింపజేస్తూంటే....! "ఏం! మాట్లాడినంత మాత్రాన నువ్వెందుకు ఆశలు పెంచుకోవాలి...." అని దుయ్యబట్టింది నా అంతరాత్మ.

రండి! కూర్చోండి! చాలా సేపైంది వచ్చి! సమాధానమైతే చెప్పానుగానీ.... మాటలో జీవంలేదు. నా గొంతు నాకే కొత్తగా వినిపించింది. "సారీ అండీ. ఈ రోజు మేము మెడ్రాస్ తిరిగి వెళ్ళిపోతున్నాం. టిక్కెట్ల రిజర్వేషన్ సంగతి తెల్సుకుందామని వెళ్ళాను. తీరా వెళ్ళిం తర్వాత గుర్తొచ్చింది మీతో చెప్పలేదని వెంటనే వచ్చాను" అంది. ఆ మాట నాకు అమృతం కురిసినట్లుగా అనిపించింది. ఇందాకటి నిరాశ పటాపంచలైంది. మళ్ళీ సంతోషం హద్దులు దాటింది. నాకోసం మళ్ళీ వచ్చిందన్న ఆనందం నన్ను వెర్రివాణ్ణి చేసింది. గతం పూర్తిగా మర్చిపోయి సంతోషంగా కబుర్లు చెప్పుకున్నాం. నేను ఏమైతే చెప్పాలనుకున్నానో అన్నీ చెప్పేశాను. ఆఖుకు "జూహీచావ్లా" విషయం కూడా. ఆ మాట అన్నప్పుడు కొద్దిగా సిగ్గుపడింది. కానీ నేనను కున్నట్లు 'షటప్' అని మాత్రం అనలేదు. నేను చెప్పాలనుకున్నది చెప్పేశాను. మనస్సు ప్రశాంతంగా వుంది. కొంతసేపటికి తనే అడిగింది, "ఇంతకీ నా పేరు తెలుసా?" అని. "ఏమిటి" అన్నాను. "మాధురి" అంది.... తను ఒకసారే అని వుంటుంది కానీ నాకు మాత్రం అనేకసార్లు అన్నట్లుగా వినిపించింది.

వాచీవంక చూసుకొని "ట్రెయిన్ టైమయ్యింది. నేను వెళ్తాను" అంటూ లేచింది. నేనూ లేచాను.

గుమ్మంవరకూ వెళ్ళి.... "స్టేషన్ వరకూ వచ్చి నాకు సెన్డాఫ్ యివ్వరా? అంది. నా మనసు ఆనందంతో వుక్కిరిబిక్కిరి అవుతోంది. "తప్పకుండా" అంటూ బయలుదేరాను.

* * *

స్టేషన్‌లో తన ఫ్రెండ్స్ ఎదురు చూస్తూ వున్నారు. ట్రెయిన్ కదలబోతోంది. గబగబ తను ఎక్కేసింది. నేను కన్నార్పకుండా అలా చూస్తూ వుండిపోయాను. తను చెయ్యి వూపుతోంది. నేనూ చెయ్యి వూపాను నా ప్రమేయం లేకుండానే. ఆనందం లేదు. ఉత్సాహం లేదు. నిస్తేజంగా వుంది నా ముఖం. ట్రెయిన్ స్పీడు అందుకుంది. "మాధురి" నాకు దూరంగా.. చాలా దూరంగా.. వెళ్ళిపోయింది. మళ్ళీ నాకు కనిపిస్తుందా?..ఏమో....!!



# ఆమె+అతడు=మనిషి

## సీరియల్

"యువతకు మీరేదయినా స్ఫూర్తినిచ్చే విషయాలు చెప్పండి" అని కోరారు అక్కడివాళ్ళు.

"నేనా?.... నేనేం చెప్పగలను. మీలోనే ఎవరైనా మాట్లాడండి."

తప్పదని పట్టుబట్టడంతో—

"నేనుగా ఏమీ చెప్పలేను కాని ఈ సందర్భంలో స్వామి వివేకానంద యువతకిచ్చిన పిలుపుని మీకు చెప్తాను."

ప్రియమైన యువకులారా!

మీలో అంతర్లీనంగా అద్భుత శక్తిసామర్థ్యాలున్నాయి. మీరు చేయవల్సిందల్లా మీపై మీరు అపారమైన నమ్మకం కలిగి ఉండటమే. ప్రతిక్షణం నిర్భయంగా నిశ్చింతగా జీవించండి. ధీరత్వాన్ని ప్రదర్శించండి.

ప్రపంచం మిమ్మల్ని పిలుస్తూంది. ఉత్సాహం ఉరకలువేసే యువశక్తి కోసం. యువరక్తం కోసం నిరీక్షిస్తోంది.

నీ గురించి నువ్వు తక్కువగా అంచనా వేసుకోవడంకంటే ఘోరమైన పాపం మరొకటిలేదు. ఎప్పుడూ నీ గురించి ఉన్నతంగా ఆలోచించు. ఉన్నతమైన ఆశయాలను ఏర్పరుచుకో. వాటి సాధనకోసం అహర్నిశలు శ్రమించండి. ఏ దశలోనూ మీపై మీకున్న నమ్మకాన్ని చెదరనీయకండి. ఈ విశ్వంలో దేనినైనా కఠోర పరిశ్రమతో సాధించుకునే ప్రతిభా పాటవాలు, నిరాశ నిస్పృహలు జయటకు దూసుకు వస్తాయి. అంచేత నా కోరిక ఒక్కటే. భయాన్ని దరిచేరనీయకండి. ఎలాంటి సమయంలోనైనా తట్టుకొని నిలబడగల్గే గుండె నిబ్బరాన్ని ఏర్పర్చుకోండి.

సత్‌నారాయణ్ పొన్నూరి